క్లుప్తంగా

కనకదుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే శంబంగి



కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి దంపతులు

బొబ్బిలి: విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆయన సతీమణి చిన్నమ్మలు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వహణాధికారులు ఎమ్మెల్యే దంపతులకు సాదరస్వాగతం పలికారు. రాష్ట్ర ప్రజలు బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



ఆదిలక్ష్మికి నగదు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన గుండ ఆదిలక్ష్మికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం శుక్రవారం అందజేశారు. ఇటీవల ఆమె భర్త నీలయ్య మృతి చెందగా, ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 వేలను సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు చేతులమీదుగా అందించారు. మిగిలిన నగదును నామినీ బ్యాంకు ఖాతాకు త్వరలో జమ అవుతుందన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు భరద్వాజ్

రేగిడి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలు శుక్రవారం చేశారు. ఫిజియోథెరపిస్ట్ ఎం.భరద్వాజ్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయడం ద్వారా పనిచేయని అవయవాలు కూడా పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రతినెలా ఇక్కడ నిర్వహించే ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ చేసిన లాగే ఇంటి దగ్గర కూడా థెరపీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, ఎరకయ్య, ఐఈఆర్పీ యు.మహేశ్వరి, రాంబాబు పాల్గొన్నారు.

ఉంగరాడలో గ్రామసభ



మాట్లాడుతున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ఉపాధి హామీ పనుల గుర్తింపుపై చర్చించారు. రైతులు, వేతనదారుల అభిప్రాయాలు సేకరించి, తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో ఎస్.హరనాథరావు, సర్పంచ్ భుజంగరావు, ఎంపీటీసీ గౌరునాయుడు, కార్యదర్శి గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా క్రీడాపోటీలు

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి అండర్–14 క్రీడా పోటీలు ఉల్లాసంగా జరుగుతున్నాయి. బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాలకు చెందిన దాదాపు 250 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని, తమ సత్తా చాటుతున్నారు. ఇక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు జిల్లా స్థాయిలో ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో ఆడనున్నట్లు సమాచారం.

స్త్రీనిధి రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ రవికుమార్

బొబ్బిలి: పొదుపు సంఘాల సభ్యులు స్త్రీనిధి రుణాలను సక్రమంగా చెల్లించాలని వెలుగు క్లస్టర్ ఏరియా కో–ఆర్డినేటర్ రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలో వెలుగు సమాఖ్య సభ్యులతో ఆయన సమావేశమై, డ్వాక్రా సభ్యులకు పలు సూచనలు చేశారు. రుణాల చెల్లింపు సక్రమంగా చేస్తే తర్వాత వారికి రుణాలు ఇచ్చే అవకాశముంటుందన్నారు. ఏపీఎం శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తోంది. గ్రామగ్రామాన చేపడుతున్న వైద్యశిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రోగులకు ఆరోగ్య తనిఖీలు చేయడంతో పాటు, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమిస్తున్నారని, 45 రోజుల పాటు అందుబాటులో ఉండే ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు కోరారు.

– సాక్షి నెట్‌వర్క్.



రేగిడి: మునకలవలసలో మందుల కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



సంతకవిటి: జావాంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్



వంగర: శివ్వాంలో పంపిణీకి సిద్ధం చేసిన మందుల వద్ద ఎంపీపీ సురేష్ ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు



బాడంగి: తెంటువలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజాప్రతినిధులు, వైద్యారోగ్య సిబ్బంది



బొబ్బిలి: బొబ్బిలి పట్టణ మూడో వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు



రాజాం: ఆగూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో శంకరరావు



రామభద్రపురం: జన్నివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్లు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి



రాజాం: ఆగూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, సర్పంచ్ అప్పారావు



మెంటాడ: కైలాం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల తదితరులు



బాడంగి: తెంటువలసలో ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు అందజేస్తున్న మందులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు



బొబ్బిలి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్

ప్రతిఇంటా ‘సంక్షేమ’ వెలుగులు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు జరిగేలా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు నెలకొన్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంతగా మండలంలోని చిత్తారపురం గ్రామ సచివాలయం పరిధిలోని పోడలి, గుజ్జన్నపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఓ వైపు అభివృద్ధి కొనసాగిస్తూనే మరోవైపు నిరంతరాయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వం పథకాలు అందజేస్తోందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా అప్పటి జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకే వచ్చేవన్నారు. దీంతో అర్హులకు అన్యాయం జరిగేదన్నారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ హయాంలో మాత్రం అర్హులను జల్లెడపట్టి మరీ వారికి పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలోని గ్రామ అభివృద్ధికి రూ.20 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటితో గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. 2024లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సిరిపురపు జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ మొయ్య మోహన్, ఎంపీటీసీ ఎం.జయసుధ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, సర్పంచ్‌లు పి.గణపతి, వి.రమణ, పి.ఈశ్వరరావు, ఎన్.విశ్వేశ్వరరావు, మిర్తివలస ఎంపీటీసీ ఆర్.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

వంగర: ప్రతీ రైతు తమ పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదుతో పాటు, ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో తట్టికోట కన్నబాబు సూచించారు. శుక్రవారం మండలంలోని మద్దువలస గ్రామానికి వెళ్లిన ఆయన అక్కడి రైతులతో మాట్లాడి, వారు ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. మండలంలో 9,673 ఎకరాలకు సంబంధించి, 5,365 మంది రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకున్నారని, 5,308 మంది రైతులు ఈకేవైసీ నమోదు చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈకేవైసీ చేయని వారు త్వరితగతిన ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సోమరాజుపేట గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద చేస్తున్న ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఏవో జి.మురళీకృష్ణ శుక్రవారం పరిశీలించారు. రైతులు తమ పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ రాయితీలు, పథకాలు, సదుపాయాలు అందుతాయన్నారు. మండలంలో 90 శాతం మేర ఈకేవైసీ పూర్తయిందన్నారు.

‘ఆపరేషన్ పరివర్తన్’

రామభద్రపురం: మండలంలోని చందాపురం గ్రామంలో ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈబీ బొబ్బిలి సీఐ ఆర్.జైభీమ్ సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మద్యం తాగుడుకు బానిసలైన వారిని సమాజం చూసే చిన్నచూపు, శరీరావయవాలపై మద్యం కలిగించే దుష్ప్రభావాలను క్షుణ్ణంగా తెలిపారు. సారా అమ్మినా, తయారు చేసినా నేరమని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామస్తులతో సారా నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది చంద్రప్రసాద్, జయరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సారా నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న చందాపురం గ్రామస్తులు

తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ

సంతకవిటి: తూటికాడ కషాయం పిచికారీతో వరి పంటలో వచ్చే దోమపోటు తెగులు నివారణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జ్ ఎ.నారాయణమ్మ అన్నారు. మండలంలోని గోవిందపురం గ్రామంలో తూటికాడ కషాయం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎకరం పంట పొలానికి పిచికారీ చేసేందుకు దంచిన రెండు కేజీల తూటికాడ ఆకులు, ఐదు లీటర్ల ఆవుమూత్రం, మరో ఐదు లీటర్ల నీరు కలిపి బాగా ఉడికించాలి. ఇలా తయారైన కషాయాన్ని వడకట్టి, పంటపై పిచికారీ చేయాలని తెలిపారు.



తూటికాడ కషాయం తయారు చేస్తున్న గోవిందపురం గ్రామస్తులు

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

రామభద్రపురం: జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు 15 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ జీవీఎస్ ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో జరిగిన పోటీల్లో వీరు విశేష ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఎంపికైన వారంతా మండలంలోని ఆరికతోట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులని పీడీ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు వారిని పాఠశాల సిబ్బంది అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఉత్సవాలకు అనుమతులు తీసుకోవాలి

రాజాం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన మండపాలు పెట్టే ప్రాంతాల్లో స్థల యజమాని, సంబంధిత వ్యక్తుల అనుమతులు ఉండాలన్నారు. ముందుగా పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలని, కమిటీ సభ్యుల పేర్లు తెలపాలన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా డీజే సౌండ్ పెట్టకూడదన్నారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అనుమతులు లేకుండా లైట్ సెట్టింగులకు కరెంటు వినియోగించవద్దన్నారు. వివాదాస్పద గ్రామాల్లో ఉత్సవ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

రాజాం సిటీ:

రాజాం నియోజకవర్గ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక తెలగవీధి పాఠశాలలో జరిగిన ఈ ఎన్నికలో గౌరవాధ్యక్షుడిగా జె.నీలయ్య, ముఖ్య సలహాదారుగా బి.జానకీరావు, అధ్యక్షుడిగా నక్క తవిటయ్య, ప్రధాన కార్యదర్శిగా అల్లెన తవిటిరావు, కోశాధికారిగా వడ్డి పాపారావు ఎంపికయ్యారు. వీరితో పాటు ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా జి.సింహాచలం, బి.అప్పారావులను ఎన్నుకున్నారు. వీరంతా సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

నేర నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి

రామభద్రపురం: నేర నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలని సీఐ తిరుమలరావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సురేంద్రనాయుడుతో కలిసి గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో శుక్రవారం సమావేశమైన ఆయన గ్రామీణులు సైబర్ నేరాల బారినపడి మోసపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మద్యం అమ్మకాలు, సారా తయారీ నివారించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఎక్కడా అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. అనధికార లోన్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దని, లోన్ యాప్‌లపై ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడి, వేధింపులకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయడం గానీ లేకపోతే 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు.



గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

రూ.1.13 కోట్లతో పార్కు నిర్మాణ పనులు

రాజాం: స్థానిక పట్టణంలోని బొబ్బిలి జంక్షన్‌లో జరుగుతున్న ఎర్రవాని చెరువు పార్కు నిర్మాణ పనులను మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంవీ నాగరాజు, ఆంధ్రప్రదేశ్ బ్యూటిఫికేషన్ అండ్ గ్రీనరీ కార్పొరేషన్ కన్సల్టెంట్ పి.దుర్గాప్రసాద్ కలిసి శుక్రవారం పరిశీలించారు. దాదాపు రూ.1.13 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, చెరువు గట్టు సరిహద్దు సమస్యలు పరిష్కరించి, ఫెన్సింగ్ వేసినట్లు తెలిపారు. చెరువు గట్టు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం తొలగించాలని జిల్లా అధికారులకు లేఖ రాశామన్నారు. త్వరలోనే పార్కు పనులు పూర్తి చేసి, ప్రజావినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ పి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పార్కు నిర్మాణ పనుల పరిశీలనలో అధికారులు

పోలీస్ ఔట్‌పోస్ట్ తనిఖీ

వంగర: మండలంలోని లక్ష్మీపేట పోలీస్ ఔట్ పోస్టును రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్ పికెటింగ్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

బొబ్బిలి: దసరా సెలవుల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో తరగతులు నిర్వహించవద్దని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడైనా తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం వస్తే, అక్కడికి వచ్చి తరగతులను అడ్డుకుని నిరసన తెలియజేస్తామన్నారు. ఆ తర్వాత అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. విద్యాశాఖాధికారులు కూడా దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించకుండా ప్రత్యేక దృష్టిసారించాలని, విద్యార్థుల మానసిక వికాసానికి బాటలు వేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వందశాతం పూర్తిచేయాలి



వేపాడ: నల్లబిల్లిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

బొండపల్లి: జగనన్న లేఅవుట్‌ల్లో ఇళ్ల నిర్మాణాలను శతశాతం పూర్తిచేయాలని హౌసింగ్ ఏఈఈ బి.వి.రమణమూర్తిరాజు సూచించారు. మండలంలో రోళ్లవాక గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో శుక్రవారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే రాయితీలపై, కాలనీలో కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సంతోష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, సుంకరి రామునాయుడు, కెల్ల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లబిల్లిలో..

వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్ నేతృత్వంలో అధికారుల బృందం జగనన్న లేఅవుట్‌లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామంలో సొంత స్థలాల్లో 52 మందికి, జగనన్న లేఅవుట్‌లో 12 మందికి ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 37 ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, ఏపీఓ ఆదిలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మ్యాజిక్ షో



మ్యాజిక్ షో ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న మెజీషియన్

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం చేపట్టిన మ్యాజిక్ షో ఆకట్టుకుంది. గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, వాటి బారినపడకుండా ఉండాల్సిన తీరు, మూఢనమ్మకాలను మెజీషియన్ వివరించారు. కార్యక్రమంలో గుళ్లసీతారాంపురం ఏపీజీవీబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.